epaper.manachourasta.com


# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 128 | బుధవారం | 09.10.2024





## తెలంగాణ సంస్కృతికి ప్రతీక

# బతుకమ్మ

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్, టీజీఓస్, ట్రెస్సా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, పౌరసరఫరాలు, పంచాయతీ రాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, తదితర శాఖల మహిళా ఉద్యోగులు, తీరొక్క పూలతో పేర్చిన భారీ బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్నారు. బతుకమ్మల చుట్టూ మహిళా ఉద్యోగులు చేరి బతుకమ్మ పాటలకు కోలాటం వేస్తూ నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు బతుకమ్మ పాటలను ఆలపించి ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కావ్య మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు ఎన్నో తరాల చరిత్ర ఉందన్నారు. తెలంగాణలో బతుకమ్మ పుట్టిందని, కాకతీయ, శాతవాహనుల శాసనాల్లో బతుకమ్మ చరిత్ర ఉందన్నారు. తరాలు మారిన బతుకమ్మ మనతోనే ఉందన్నారు. బతుకమ్మ పండుగను చెరువుల పండుగ కూడా చెప్పుకోవచ్చని అన్నారు. తన చిన్నప్పుడు బతుకమ్మ పండుగ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తొమ్మిది రోజుల పాటు వాడవాడల్లో బతుకమ్మ ఉత్సవాలను ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు యావత్తు రాష్ట్రంలోనే వరంగల్ కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. మన సాంప్రదాయాన్ని భవిష్యత్తు తరాలకు అందించేలా ముందుకు తీసుకెళ్లాలన్నారు. మహిళా ఉద్యోగులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ అంటేనే బతుకమ్మ అని, బతుకమ్మ పండుగకు ప్రపంచ ఖ్యాతి లభించిందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జెడ్పి సీఈవో విద్యాలత, డీఆర్డిఓ నాగ పద్మజ, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్ రావు, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు భాస్కర్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సోమయ్య, నాలుగు తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాస్య నాయక్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## గొర్ల కాపరులు అప్రమత్తంగా ఉండాలి | 2



### కొనుగోళ్లు సక్రమంగా 2
## నిర్వహించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



### అక్కడ ఏడొద్దులకే.. 3
## సద్దుల బతుకమ్మ
- పెద్దమదూరులో ప్రత్యేక ఆచారం




### పెరిగిన ధరలను 2
## తగ్గించాలి
- సీపీఎం నేతల డిమాండ్

General News



# కొనుగోళ్లను సక్రమంగా నిర్వహించాలి

## కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** వానాకాలం (ఖరీఫ్) 2024-25 సీజన్ వరి ధాన్యం (సన్న, దొడ్డు రకం) కొనుగోళ్లను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏఈఓలు, డీపీఎంలు, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రెండు లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని, ఇందులో దాదాపుగా 55 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ఉంటుందని అంచనా వేశారు. జిల్లాలో 180 దొడ్డు రకం, 116 సన్న రకం వరి ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా సన్న రకం ధాన్యంపై రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బోనస్ 48 గంటల్లో రైతుల అకౌంట్లలోకి జమ అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకానికి వేర్వేరుగా రికార్డులను సరైన విధంగా నిర్వహించాలని, మూమెంట్ ప్లాన్ రిజిస్టర్లను సన్న, దొడ్డు రకానికి వేరుగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ వసంత, డీసీఎస్ఓ సరస్వతి, డీఏఓ రామారావు నాయక్, డీఎం సీఎస్ హాతీరాం, ఇతర సంబంధిత అధికారులు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయాలి



**జనగామ, మన చౌరాస్తా :** ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కుడా (KUDA) పరిధిలోని చిల్పూర్, ఘనపూర్ (స్టేషన్), జాఫర్గఢ్ మండలాల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, రెవెన్యూ, నీటి పారుదల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుడా (KUDA) పరిధిలోని చిల్పూర్, స్టేషన్‌ఘన్‌పూర్, జాఫర్‌గఢ్ మండలాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మొత్తం 7,433 వచ్చాయని, ఇందులో భాగంగా 633 సర్వే ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన 6,800 పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని, గ్రామాలు, మండలాల వారీగా ట్రాకింగ్ షీట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకోవాలని, సర్వే నంబర్ ల వారీగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఈడీఎం గౌతమ్ రెడ్డి, మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గం

**చేర్యాల, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా మెరుగు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పుర్మా ఆగం రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మంజ మల్లేషం నియమితులయ్యారు. టీపీసీసీ ఆదేశం మేరకు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నరసారెడ్డి మంగళవారం వారికి నియామక పత్రాలను జారీ చేయగా జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి



బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా జనగామ, సిద్దిపేట డీసీసీ అధ్యక్షులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వారి నియామకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.




# పెరిగిన ధరలు తగ్గించాలి

చేర్యాల, మన చౌరాస్తా : పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో మంగళవారం జరిగిన సీపీఎం శాఖ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విచ్చలవిడిగా పెట్రోలు, డీజిల్ ధరలు పెంచిందని, దీంతో నిత్యవసర వస్తువులు ధరలు పెరిగాయన్నారు. పెరిగిన ధరల వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంట నూనె ధర కిలో ప్యాకెట్ రూ.40కి పెరిగిందని ఉల్లిగడ్డ, అల్లం, ఎల్లిగడ్డ, కూరగాయలు నిత్యవసర వస్తువు ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో చిట్యాల గ్రామ సమస్యలపై ప్రజలను ఏకం చేసి పోరాటం చేస్తామన్నారు. గ్రామంలో కోతుల బెడద ఉందని ఈ కోతుల వల్ల రైతుల పంటలు పాడవుతున్నాయని, కూరగాయలు పండించే పరిస్థితి లేదన్నారు. ఇండ్లు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. మార్కెట్ కు వచ్చిన ధాన్యానికి రైతులకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలన్నారు. చిట్యాల గ్రామ మొదటి శాఖకు మల్కని ఎల్లయ్య, రెండో శాఖకు బొడియం చంద్రారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకట్ మావో, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్, పట్టణ కమిటీ సభ్యుడు బోయిన మల్లేశం, సూర్య, తిరుపతి, ఏల సాంబయ్య, సిద్ధులు, రాములు, రాజయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.



# గొర్ల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

**జనగామ, మన చౌరాస్తా :** దసరా పండుగ దృష్ట్యా జనగామ జిల్లాలో ఉన్న గొర్ల కాపరులు అప్రమత్తంగా ఉండాలని గొర్ల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, కురుమ సంఘం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ అన్నారు. గొర్ల కాపరులతో వారు మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా గొర్ల దొంగలు ఎక్కువ అవుతారని, గొర్ల మందలపై దాడి చేసి గొర్లను ఎత్తుకొని వెళ్లే అవకాశాలు చాలా ఉంటాయన్నారు. ముఖ్యంగా వలస వచ్చిన గొర్ల కాపర్లు రాత్రి పూట, ఎప్పటికప్పుడు గొర్రెల మందను గమనిస్తూ ఉండాలన్నారు. దసరా సందర్భంగా ఎవరు బెదిరించిన పండుగ పూట గొర్రెలను ఎవరికి ఇవ్వద్దు ఎవరైనా బెదిరిస్తే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మహబూబ్ నగర్ లాంటి, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన గొర్ల కాపర్ల సమస్యలు అడిగి తెలుసుకుని వారికి సలహాలు, సూచనలు తెలిపారు. కార్యక్రమంలో గోపాలపురం ఆంజనేయులు, ధన్వాడ సిద్ధులు, వెంకటపాలెం రాములు, బీరప్ప, అరకు మల్లప్ప, శివకోటి, రంగలపాలం మల్లేష్, పల్లగుంటి పెద్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

Local News




## సీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాలు

**పాలకుర్తి సీహెచ్‌సీలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాలకుర్తి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్‌బి.పరమేశ్వరి, స్టాఫ్ నర్స్ లక్ష్మి, శ్వేత, స్వర్ణలత, కృష్ణవేణి, రజినీ, ఫార్మసిస్ట్ రాధిక, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.** - పాలకుర్తి, మన చౌరాస్తా

## ఏడొద్దులకే.. సద్దులు..

దేవరుప్పల మండలం పెద్దమడూరులో అందరిలా కాకుండా ఇక్కడ ఏడో రోజే సద్దుల బతుకమ్మ ఆట ఆడతారు. పెద్దమడూరు గ్రామ మహిళలంతా ఎంతో ఉత్సాహంతో అందమైన బతుకమ్మలు పేర్చుకుని వచ్చి గ్రామ చెరువు కట్ట దగ్గర బతుకమ్మలు ఆడుకున్నారు.

- దేవరుప్పల , మన చౌరాస్తా





## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కోఆర్డినేటర్ నీలం పద్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా కృష్ణస్వామి, జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి కావ్య శ్రీరెడ్డి, జనగామ మండల అధ్యక్షురాలు కాముని జయ, పట్టణ అధ్యక్షురాలు జక్కుల అనిత వేణుమాధవ్, మంత్రి సుమలత, లక్ష్మి, జక్కుల రేణుక, శ్రీలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

*- జనగామ, మన చౌరాస్తా*

## పథకాల అమలులో ప్రభుత్వం విఫలం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** తెలంగాణలో పథకాలు అమలు చేయడంలోకాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ ఫిరోజ్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ కానుకగా బతుకమ్మ చీరలు ప్రతి ఇంటి ఆడబిడ్డకు పంపిణీ చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు కూడా బతుకమ్మ చీరల ఊసే లేదన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఇస్తానని చెప్పి సంవత్సరం గడిచిన ఇంతవరకు ఆ పథకం అమలే లేదన్నారు. పెళ్లి అయిన మహిళలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు 2 లక్షల రుణమాఫీ ఎవరికి కూడా కాలేదు, రైతు భరోసా కాదు కదా ఇప్పటి వరకు రైతు బంధు కూడా వేయలేదన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ జరిగే వరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యం పోరాటాలు చేస్తామన్నారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**కొముురవెల్లి, మన చౌరాస్తా :** పేకాట స్థావరంపై కొమురవెల్లి పోలీసులు, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. కొమురవెల్లి సీఎస్ పరిధిలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివారలు ఎస్సై రాజు కథనం ప్రకారం.. మండలంలోని పోసాన్‌పల్లి శివారులో జగ్గన్నగారి శంకర్ గౌడ్ షెడ్డులో కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారంతో టాస్క్ ఫోర్స్, కొమురవెల్లి పోలీసులు కలసి దాడి చేసి పేకాట ఆడుతున్న వైరం రాజు, వేముల కృష్ణ, గంగాదేవి వెంకటేష్, గుగులోత్ వెంకటేష్, మహమ్మద్ నిజాంను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ 60,270 నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారైన ఆరుగురి కోసం గాలింపు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

## టీపీఎఫ్ సదస్సును విజయవంతం చేయండి

- **తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వి రెడ్డి**

**జనగామ , మన చౌరాస్తా :** నేడు జరగబోయే తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు ఇప్ప పృథ్వి రెడ్డి పిలుపునిచ్చాడు. 9 అక్టోబర్ 2010 న గద్దర్ అధ్యక్షతన ఏర్పడిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ మిలిటెంట్ పోరాటాల ద్వారానే తెలంగాణ సాధ్యమవుతుందనే ఆలోచనతో తెలంగాణ ఉద్యమంలో, ఏర్పాటులో కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రజాస్వామిక తెలంగాణ కోసం మాట్లాడుతున్న ఫ్రంట్ పైన కెసిఆర్ తీవ్ర నిర్బంధం ప్రయోగించి అనేకమంది కార్యకర్తలు, నాయకులను కేసులు, జైళ్ల పాలు చేసాడని అన్నాడు. ఆవిర్భావ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కాసీం, పౌరహక్కుల సంఘం నేత గడ్డం లక్ష్మణ్, ప్రజాస్వామిక రచయిత్రుల సంఘం నుండి కాత్యాయనీ విద్మహే, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ వివిధ అంశాల పైన ప్రసంగిస్తారని, సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మన చౌరాస్తా
09.10.2024 బుధవారం

# ఓటీటీలోకి శబరి

**మన చౌరాస్తా, సినిమా :** దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో విలక్షణ నటిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది వరలక్ష్మీ శరత్ కుమార్. కెరీర్ ప్రారంభంలో హీరోయిన్ గా నటించిన ఆమె ఆ తర్వాత విలన్ గానూ సక్సెస్ అయ్యింది. కొన్ని నెలల క్రితం తన ప్రియుడితో కలిసి పెళ్లి పీటలెక్కిందీ అందాల తార. అయితే పెళ్లికి ముందు వరలక్ష్మీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం శబరి. దర్శకుడు అనిల్ కాట్జ్ పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీని తెరకెక్కించారు. ఈ ఏడాది మే 3న తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో గ్రాండ్ గా ఈ సినిమా రిలీజైంది. భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శబరి సినిమా ఆడియెన్స్ ను బాగానే మెప్పించింది. థ్రిల్లింగ్ అంశాలు మెండుగా ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ఓ మోస్తరుగా వసూళ్లు రాబట్టింది. అయితే ఇప్పటి వరకు ఈ థ్రిల్లింగ్ మూవీ ఓటీటీలోకి రాలేదు. ఎట్టకేలకు తాజాగా శబరి సినిమాపై ఓటీటీ అప్డేట్ వచ్చింది. దసరా కానుకగా వరలక్ష్మి సినిమా స్ట్రీమింగ్ కానుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ సన్ నెక్ట్స్ శబరి సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 11 నుంచి శబరి సినిమాను ఓటీటీలోకి రానుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది సన్ నెక్ట్స్ . తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ అవుతుందని ఒక పోస్టర్ విడుదల చేసింది ఓటీటీ సంస్థ. శబరి చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్‌తో పాటు గణేశ్ వెంకటరామన్, మైమ్ గోపి, బేబి కృతిక, శశాంక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. మహా మూవీస్ బ్యానర్ పై మహేంద్ర నాథ్ కొండ్ల ఈ సినిమాను నిర్మించగా, గోపీసుందర్ బాణీలు అందించారు. సినిమాటోగ్రాఫర్ గా రాహుల్ శ్రీ వాస్తవ, నాని వ్యవహరించారు. ధర్మేంద్ర కాకర్ల ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తించారు. ఇక శబరి చిత్రంలో కూతురుని కాపాడుకునే తల్లి పాత్రలో వరలక్ష్మీ శరత్ కుమార్ అద్భుతంగా నటించింది. థియేటర్లలో ఈ మూవీని మిస్ అయ్యారా? అయితే వీకెండ్ లో టైమ్ పాస్ కోసం శబరిపై ఒక లుక్ వేయచ్చు.

